నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, శనివారం 6 జూలై 2024 RANGAREDDY

విద్యుత్ బిల్లులపై క్యూఆర్ కోడ్

సిటీబ్యూరో, జూలై 5 (నమస్తే తెలంగాణ): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ నెల నెలా జారీ చేసే విద్యుత్ బిల్లులపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించనున్నది. వినియోగదారులు తమ మొబైల్ ఫోన్ ద్వారా ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ బిల్లులను సులభంగా చెల్లించవచ్చు. క్యూఆర్ కోడ్‌తో కూడిన బిల్లులు వచ్చే నెల నుంచి వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి. ఆర్‌బీఐ కొత్త నిబంధనల వల్ల కొన్ని థర్డ్ పార్టీ యాప్స్‌లో నేరుగా బిల్లులు చెల్లించే సదుపాయాన్ని ఇటీవల తొలగించారు. ఈ నేపథ్యంలోవిద్యుత్ శాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నది. కాగా ఈ నెల నుంచి థర్డ్ పార్టీ యాప్స్‌లో నేరుగా బిల్లులు చెల్లించే అవకాశం లేకున్నా, ప్రస్తుతానికి బిల్లు వసూళ్లపై ప్రభావం పడలేదని అధికారులు తెలిపారు. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో బిల్లులు జారీ కావడంతో ఇప్పటి వరకు మొత్తం 1.20 లక్షల మంది వినియోగదారులు బిల్లులు చెల్లించారని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం సంస్థ వెబ్‌సైట్, మొబైల్ యాప్ నుంచి బిల్ డెస్క్, పీజీఐ(పేమెంట్ గేట్‌వే ఆఫ్ ఇండియా), పేటీఎం, టీఎ వ్యాలెట్, టీజీ/ఏపీ ఆన్‌లైన్, మీసేవ, టీ వ్యాలెట్ ద్వారా బిల్లులు చెల్లించవచ్చు. గ్రేటర్ పరిధిలోని 10 సర్కిళ్లలో ఉన్న విద్యుత్ వినియోగదారుల కోసం ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లలో ఇప్పటికే ఎస్టిమేషన్ పేమెంట్స్, ఇతర బిల్లుల చెల్లింపుల్లో క్యూఆర్ కోడ్ ఆధారిత పేమెంట్స్ జరుగుతున్నామని అధికారులు తెలిపారు.

చేజింగ్.. ఫైరింగ్

పెద్దఅంబర్‌పేట, జూలై 5: అది శుక్రవారం ఉదయం దాదాపు 9.15 నిమిషాలు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్దఅంబర్‌పేట ఓఆర్ఆర్ వద్ద విజయవాడ జాతీయ రహదారిపై భారీ వాహనాలు రయ్‌యమంటూ దూసుకుపోతున్నాయి. ఇంతలోనే ఓ ఆటోను సాధారణ వాహనాల్లాగే ఓ కారు చేజ్ చేసింది.. ఆటో ముందే ఆపేసింది. కారులోని ఇద్దరు దిగి ఆటోలో కూర్చున్న ఇద్దరిని పట్టుకుంటున్నారు. కానీ, ఆటోలోని ఇద్దరు తప్పించుకునేందుకు పెనుగులాడుతున్నారు. ఇంతలోనే ఫైరింగ్ శబ్దం వినిపించింది. ఇదంతా చూసిన చుట్టుపక్క వాళ్లు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. పార్థి గ్యాంగ్ వరుస దోపిడీలు చేస్తూ.. తప్పించుకు తిరుగుతున్నది. ముఠా కదలికలపై నిఘా పెట్టిన నల్లగొండ సీసీఎస్ పోలీసులు ముఠాలోని ఇద్దరు సభ్యులు శుక్రవారం నల్లగొండ జిల్లా నుంచి హైదరాబాద్ వైపు వస్తున్నట్లు తెలుసుకున్నారు. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారమిచ్చి ముఠాను కారులో వెంబడించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కొత్త గూడెం చౌరస్తాలో ఇద్దరు ముఠా సభ్యులు ఆటోలో ఎక్కినట్టు గుర్తించి పెద్దఅంబర్‌పేట ఓఆర్ఆర్ వద్ద సంపూర్ణ హోటల్ ఎదురుగా ఆటోను చేజ్ చేశారు. దొంగలు తప్పించుకునే ప్రయత్నం చేయగా.. సీసీఎస్ కానిస్టేబుల్ ఒక రౌండ్ గాల్లోకి కాల్పులు జరిపినట్టు తెలుస్తున్నది. ఆ వెంటనే అక్కడకు చేరుకున్న అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ పోలీసుల సహకారంతో దొంగలను అదుపులోకి తీసుకుని, నల్లగొండ జిల్లాకు తరలించారు.

టీజీపీఎస్సీ ముట్టడికి వచ్చిన నిరుద్యోగులను అడ్డుకొని..పట్టుకెళ్తున్న పోలీసులు

నిరుద్యోగులపై నగర పోలీసులు విరుచుకుపడ్డారు. తమ ప్రతాపాన్ని చూపారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం నిరుద్యోగులు శుక్రవారం టీజీపీఎస్సీ(తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్) కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు టీజీపీఎస్సీ వద్ద భారీ బందోబస్సు ఏర్పాటు చేయడమే కాకుండా..నగరం నలుమూలల నుంచి నాంపల్లి వైపు వెళ్లకుండా నిరుద్యోగులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అత్యుత్సాహం ప్రదర్శించిన పోలీసులు.. నిరుద్యోగులతో పాటు రైతులు, జర్నలిస్టులు, సామాన్యులను సైతం వదలలేదు. ఉస్మానియా యూనివర్సిటీ, అశోక్‌నగర్, చిక్కడపల్లి, అమీర్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, హిమాయత్‌నగర్ ఇలా అన్ని ప్రాంతాల్లో స్థానిక పోలీసులు నిఘా పెట్టి నిరుద్యోగ యువత బయటకు వెళ్లకుండా ఉండేలా కట్టడి చేశారు. ఇలా నిర్బంధకాండ కొనసాగుతున్నా.. ఛేదించుకొని.. నిరుద్యోగులు టీజీపీఎస్సీకి చేరుకోవడంతో పోలీసులు ఆగ్రహంతో ఊగిపోయారు. దొరికినవారిని దొరికినట్లు ఈడ్చుకెళ్లి.. అరెస్టు చేశారు. పోలీసుల అనుసరించిన వైఖరిపై నిరుద్యోగులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. - సిటీబ్యూరో, జూలై 5 (నమస్తే తెలంగాణ)

నిరుద్యోగులపై దమనకాండ

టీజీపీఎస్సీ ముట్టడి.. ముళ్ల కంచెలతో కట్టడి

- నాంపల్లిలోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముట్టడికి బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు సికింద్రాబాద్ నుంచి తరలివెళ్లి.. ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే పోలీసులు వారిపై దాడి చేసి గాయపరిచారని, అనంతరం అరెస్టు చేసి గోషామహల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు యాదా క్రాంతి తెలిపారు.

టీజీపీఎస్సీ వద్ద ముళ్ల కంచె ఏర్పాటు చేసిన పోలీసులు

గోషామహల్ స్టేడియంలో..

ఓ నిరుద్యోగిని ఈడ్చుకెళ్తూ..

- నిరుద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయ ముట్టడికి పిలుపునివ్వడంతో పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి నాంపల్లికి వచ్చే మార్గాలన్నింటినీ కట్టడి చేశారు. అయితే కారిడార్-1లోని మియాపూర్-ఎల్బీనగర్ మార్గంలో నడిచే మెట్రో రైళ్లలో ప్రయాణించేందుకు వచ్చిన యువత, మహిళలను అడ్డుకున్నారు. దీంతో తాము ముట్టడి కార్యక్రమానికి వెళ్లడం లేదని, తమ ఆఫీసులకు వెళ్తున్నామని చెప్పినా.. పోలీసులు వినిపించుకోకుండా అడ్డుకొని మెట్రో రైలులో ప్రయాణం చేయనివ్వలేదు.
- రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గుండుమల్ల పాండుగౌడ్‌తో పాటు విద్యార్థి నాయకులను చైతన్యపురి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.
- తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముట్టడిని అడ్డుకునేందుకు తెల్లవారుజామున బీఆర్ఎస్ జిల్లా యువజన విభాగం మాజీ అధ్యక్షుడు మాధవరం నర్సింగ్‌రావును ముందస్తుగా అరెస్టు చేసి మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు నర్ర ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నవీన్, వినోద్, శ్రీకాంత్, సాయి తదితరులు మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నర్సింగ్‌రావును పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో నిరుద్యోగులు తమ నిరసనలను తెలియజేస్తుంటే ప్రభుత్వం పాశవికంగా వ్యవహరిస్తున్నదన్నారు.

టీజీపీఎస్సీ వద్ద ఆప్ నేతల నిరసన

- అక్రమ అరెస్టులతో నిరుద్యోగుల ఉద్యమాన్ని ఆపలేరని బీఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు తాళ్ల కార్తిక్, దీక్షిత్‌రెడ్డి అన్నారు. కందుకూరు మండల పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులను ముందస్తుగా స్థానిక పోలీసులు అరెస్టు చేశారు.
- నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ఉదయం 5 గంటలకు ఘట్‌కేసర్‌లో బీజేవైఎం అధ్యక్షుడు కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అనిల్ గౌడ్‌లను ముందస్తుగా అరెస్టు చేశారు.
- విద్యార్థి,యువజన సంఘాల నేతల ఇండ్లలోకి చొరబడి అక్రమంగా అరెస్టులు చేయడాన్ని ఖండిస్తూ హిమాయత్‌నగర్ వై జంక్షన్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. రాష్ట్రంలోని నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర డిమాండ్ చేశారు.

అరెస్టు చేయడం సరికాదు

ఇచ్చిన హామీలు అమలు చేయమని అడిగినందుకు నిరుద్యోగులను అరెస్టు చేయడం సరికాదు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, గ్రూప్ పోస్టులు పెంచుతామని హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీ అమలు చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నా..ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

-బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు మిద్దె సురేశ్

పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు

నిరుద్యోగులు తలపెట్టిన టీజీపీఎస్సీ ముట్టడి సందర్భంగా పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. అరెస్టులు చేయడం సరికాదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉద్యోగ నియామకాలు చేపడతామని హామీ ఇచ్చింది. హామీని వెంటనే అమలు చేయాలి.

-నిరుద్యోగి శ్రీనివాస్

- నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రూప్స్ పోస్టులు పెంచాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని తదితర డిమాండ్ల అమలు కోసం నిరుద్యోగులు టీజీపీఎస్సీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో సిటీ సెంట్రల్ లైబ్రరీ గేటు ముందు ఉదయం నుంచే చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య పర్యవేక్షణలో పోలీసులు మోహరించారు. ముట్టడికి వెళ్లేందుకు ప్రయత్నించిన నలుగురు నిరుద్యోగులను అదుపులోకి తీసుకున్నారు.

విద్యార్థి నేతను పట్టుకెళ్తూ..

మెట్రో స్టేషన్ వద్ద ప్రయాణికుడిని ఆపుతూ..

ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

గురుకుల విద్యార్థులకు అస్వస్థత

వికారాబాద్, జూలై 5 : అనంతగిరిపల్లి సమీపంలోని గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని శివారెడ్డిపేట గురుకుల పాఠశాలలో సుమారు 580 మంది విద్యార్థులు ఉన్నారు. శుక్రవారం ఉన్నట్లుండి సుమారు 40 మంది విద్యార్థులు ఒకేసారి అస్వస్థతకు గురయ్యారు. వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కొందరు తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలను మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు దవాఖానకు తరలించారు. కాగా, కలుషిత ఆహారం తినడం వల్లనే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యాని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెలిపారు. పాఠశాలలో మరుగుదొడ్లకు తలుపులు లేవని, పారిశుధ్య సమస్యలు కూడా తీవ్ర ఉన్నాయని వివరించారు. ఉన్నతాధికారులు పాఠశాలలో తనిఖీలు చేపట్టి, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులను శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్ జైన్ తదితరులు పరామర్శించారు.

చనిపోయిన వ్యక్తికి ఉద్యోగోన్నతి

ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లలో రంగారెడ్డి జిల్లాలో విచిత్రం

రంగారెడ్డి, జూలై 5(నమస్తే తెలంగాణ): ఏడాది క్రితం చనిపోయిన వ్యక్తికి జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రమోషన్ ఇచ్చి పోస్టింగ్ సైతం ఇవ్వడం చర్చనీయాంశమైంది. జిల్లాలో 213 మంది గ్రేడ్-2 హిందీ పండిట్లకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ కల్పించారు. ఇందులో మంచాల మండలం తిప్పాయిగూడకు చెందిన ఎండీ బషీర్(సీరియల్ నెం.129, రోస్టర్ పాయింట్స్ 163)కు ప్రమోషన్ కల్పించడమే విచిత్రం. ఎందుకంటే.. అతను గతేడాది జూన్ 1న మరణించారు. కానీ.. విద్యాశాఖ అధికారులు మాత్రం గుడ్డిగా ప్రమోషన్ ఇవ్వడమే కాకుండా.. కొందుర్గు మండలం చిన్నఎల్కచెర్ల హైస్కూల్‌కు పోస్టింగ్ ఇచ్చారు. లిస్ట్‌లో బషీర్ పేరు రావడంతో ఉపాధ్యాయులంతా షాక్ అయ్యారు. విషయం విద్యాశాఖ అధికారుల దృష్టికి వెళ్లడంతో వెంటనే లిస్ట్ నుంచి బషీర్ పేరును తొలగించి మరొక లిస్ట్‌ను విడుదల చేశారు. దీనిపై డీఈవో సుశీందర్‌రావు స్పందించారు. మూడు రోజుల క్రితమే లిస్ట్‌ను వెబ్‌సైట్‌లో పెట్టామని, ఎవరూ అభ్యంతరాలు వ్యక్తం చేయలేదన్నారు. బషీర్ స్థానంలో అర్హులైన వారికి పోస్టింగ్ ఇచ్చే విషయంలో తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

బదిలీలు, పదోన్నతులపై సందేహాలెన్నో..

పన్నెండేండ్ల తర్వాత జిల్లాలో బదిలీలు చేపడుతుండడంతో ఉపాధ్యాయ వర్గాలో సంతోషం వ్యక్తమవుతున్నప్పటికీ.. బదిలీ ప్రక్రియ సవ్యంగా జరగకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. 8 రోజుల షెడ్యూల్‌ను మాత్రమే విడుదల చేసిన అధికారులు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను హడావిడిగా చేపడుతున్నారు. ఇంకా జరగాల్సిన ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీల్లోనైనా పారదర్శకంగా నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

జడ్పీ ప్రత్యేక అధికారులుగా బాధ్యతల స్వీకరణ

కలెక్టర్ శశాంకకు స్వాగతం పలుకుతున్న జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

రంగారెడ్డి, జూలై 5 (నమస్తే తెలంగాణ)// వికారాబాద్ : రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ శశాంక, వికారాబాద్ జడ్పీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ పాలకవర్గ పదవీ కాలం పూర్తి కావడంతో కలెక్టర్లను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వారు శుక్రవారం జిల్లా పరిషత్‌కు చేరుకొని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవోలు కృష్ణారెడ్డి, సుధీర్ ఇతర అధికారులు కలెక్టర్లకు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు స్వాగతం పలుకుతున్న జడ్పీ సీఈవో సుధీర్